# బలగం TV BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 26 సెప్టెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4




# త్వరలోనే మరో 35000 పోస్టులు భర్తీ

- రాష్ట్రంలో మరో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసినా నిరుద్యోగ సమస్య పోదు
- డిగ్రీలు, పీజీ పట్టాలతో వస్తున్న యువతకు సరైన నైపుణ్యాలు ఉండటం లేదు
- హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లో బీఎఫ్ఎస్ఐ స్కిల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**బలగం టీవీ, హైదరాబాద్**

త్వరలోనే 35 వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అదే సమయంలో ఏటా రాష్ట్రంలో లక్షలాది మంది పట్టభద్రులు బయటికి వస్తున్నారని.. అయితే అందులో వారికి ఉద్యోగానికి సరిపడా నైపుణ్యాలు ఉండటం లేదని తెలిపారు. రాష్ట్రంలో మరో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసినా.. నిరుద్యోగ సమస్య మాత్రం పోదని పేర్కొన్నారు.

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను వీలైనంత పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిరుద్యోగ సమస్య తీవ్రతను గుర్తించి.. అందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించినట్లు తెలిపారు. డిగ్రీలు, పీజీ పట్టాలతో కాలేజీ నుంచి బయటికి వచ్చిన యువతకు సరైన నైపుణ్యాలు ఉండటం లేదని.. ఇదే నిరుద్యోగ సమస్యకు ప్రధాన అంశమని పేర్కొన్నారు. అందుకే యువతకు కంపెనీలకు కావాల్సిన నైపుణ్యాలు నేర్పించి.. ఉద్యోగ కల్పన వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేకపోతే చెడు వ్యసనాల బారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఓవైపు ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను గుర్తించి భర్తీ చేస్తూనే.. ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు పొందేలా యువతను తయారు చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు.

హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లో బీఎఫ్ఎస్ఐ స్కిల్ ప్రోగ్రామ్‌ను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ వంటి రంగాల్లో ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా కొత్త కోర్సుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. దీనిలో భాగంగా స్కిల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసినా నిరుద్యోగ సమస్యను మాత్రం తరిమికొట్టలేమని సీఎం అన్నారు.

రాష్ట్రంలో నిరుద్యోగం తీవ్రతను తమ ప్రభుత్వం గుర్తించిందని.. ఏటా 3 లక్షల మంది యువత పట్టాలు తీసుకుని బయటికి వస్తున్నట్లు తెలిపారు. కంపెనీలకు కావాల్సిన ఉపాధి అవకాశాలపై యాజమాన్యాలతో చర్చించామని.. ఎలాంటి కోర్సులు చేసిన వారు కావాలని వారిని అడుగుతున్నట్లు చెప్పారు. ఇదే సమయంలో డిమాండ్-సప్లయ్ సూత్రాన్ని నిరుద్యోగ యువత గుర్తుంచుకోవాలని.. మార్కెట్‌లో అవసరం, డిమాండ్ ఉన్న కోర్సులను నేర్చుకోవడం వల్ల ఉద్యోగాలను సాధించవచ్చని వివరించారు. డిగ్రీ చదివే విద్యార్థులు తమ భవిష్యత్తు గురించి ఆలోచించి వాటికి సిద్ధం కావాలని సూచించారు.

కొందరు విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ లేకపోవడం వల్ల ఉద్యోగాలకు ఎంపిక కాలేకపోతున్నారని తెలిపారు. బ్యాంకులు, బీమా రంగాల్లో ఎక్కువ ఉద్యోగాలు ఉన్నాయని.. అందులో రాణించాలంటే నైపుణ్యం ఉండాలని పేర్కొన్నారు. ఉద్యోగాలు,

మిగితా 3వ పేజీలో



## నిర్వాసితులకు న్యాయం చేస్తాం

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**

పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నింటిని ఈ శాసనసభ కాలంలోనే పూర్తిచేసి 12లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. నిర్వాసితులకు అన్ని రకాలుగా న్యాయం చేస్తామన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ జలాశయంతో పాటు గట్టు ఎత్తిపోతల పథకాన్ని సహచర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆర్థిక, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి ఉత్తమ్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో పాలమూరు - రంగారెడ్డికి 27వేల 500 కోట్లు ఖర్చు చేసి ఒక ఎకరాకు నీళ్లు ఇవ్వలేదని విమర్శించారు. కనీసం ప్రాజెక్టుకు నీటివాటా సాధించలేకపోయారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉదండాపూర్ రిజర్వాయర్ కింద ఆర్ఎండ్ఆర్‌కు రూ.45 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. పాలమూరు - రంగారెడ్డి పూర్తైతే 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని ఆ చిత్తశుద్ధితోనే ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.ఉదండాపూర్‌తో పాటు, ఇతర రిజర్వాయర్లలో ముంపునకు గురైన వారికి న్యాయపరంగా పునరావాసం అందిస్తామని వెల్లడించారు. గట్టు ఎత్తిపోతల ప్రాజెక్టు సామర్థ్యం పెంపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఈఎన్‌సీని మంత్రులు ఆదేశించారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు లిఫ్ట్‌ఇరిగేషన్లతో పాటు అన్ని ప్రాజెక్టులను నూటికి నూరు శాతం పూర్తి చేస్తామని ఉత్తమ్ వెల్లడించారు.

### బాధితుల నిరసన

ఎన్నికలకు ముందు ఉదండాపూర్ భూనిర్వాసితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రాజెక్టులు పనులు ఎలా మొదలు పెడతారని మంత్రుల పర్యటన సందర్భంగా బాధితులు నిరసనకు దిగారు. ఉదండాపూర్ జలాశయాన్ని మంత్రులు ఉత్తమ్, జూపల్లి సందర్శించినప్పుడు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ఎంపీ మల్లురవితో నిర్వాసితులు వాగ్వాదానికి దిగారు. ఇచ్చిన మాట ప్రకారం ప్యాకేజీ, వ్యవసాయ భూముల పరిహారాన్ని పెంచాలని కోరారు. పునరావాసం పూర్తయ్యే వరకు ప్రాజెక్టు పనులు జరగనివ్వబోమని భూనిర్వాసితులు హెచ్చరించారు. పరిహారం పెంపుపై ప్రభుత్వానికి లేఖ రాసినట్లు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి వివరించారు. ప్రస్తుతం మూడు తండాలకి ప్యాకేజీ డబ్బులు చెల్లించామని, వల్లూరు, ఉదండపూర్ గ్రామాలకు సైతం త్వరలోనే నగదు జమచేస్తామని చెప్పారు.

తెలంగాణలో

## పెట్టుబడులు పెట్టేందుకు అమెరికా కంపెనీలు ఆసక్తి



- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**బలగం టీవీ, లాస్ వెగాస్**

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అమెరికా కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారుఅమెరికాలో రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు అధికారిక ప్రతినిధి బృందానికి నేతృత్వం వహిస్తున్న ఉపముఖ్యమంత్రి బుధవారం గ్లోబల్ మార్కెట్స్ అసిస్టెంట్ సెక్రటరీ అరుణ్ వెంకటరామన్, సీనియర్ పాలసీ అడ్వైజర్ ఒలిమర్ రివెరా నోవాతో సహా అమెరికా ప్రభుత్వ అత్యున్నత స్థాయి అధికారులతో సమావేశమై చర్చించారు. అమెరికా, జపాన్ పర్యటనకు బయలుదేరిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వృద్ధి ఇంజిన్‌గా హైదరాబాద్ ప్రాముఖ్యత, ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సహకారం ఆవశ్యకత గురించి భట్టి వివరించారు.

ఇంతకుముందు, భట్టి లాస్ వెగాస్‌లోని మైన్ ఎక్స్‌పో వద్ద క్యాటర్‌పిల్లర్ ఇంక్. నిర్వహణతో సమావేశాలు నిర్వహించారు మరియు క్యాట్ డైనమిక్ ఎనర్జీ ట్రాన్స్‌ఫర్ తో సహ వారి తాజా ఉత్పత్తి సమర్పణలను పరిశీలించారు. బీకేటీ టైర్ల నిర్వహణతో పాటు విర్ట్‌జెన్ గ్రూప్‌తో కూడా చర్చలు జరిపాడు మరియు మైనింగ్ పరిశ్రమకు వారి తాజా ఉత్పత్తి సమర్పణలను పరిశీలించారు.

తెలంగాణలో మైనింగ్ రంగంలో పెట్టుబడులకు అమెరికా సహా పలు దేశాల కంపెనీలు ఆసక్తి కనబరిచాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అమెరికాలోని లాస్ వేగాస్ నగరంలో నిర్వహిస్తున్న ప్రపంచ అతిపెద్ద మైనింగ్ ఎక్స్ పో 2024ను భట్టి విక్రమార్క తన బృందంతో కలిసి సందర్శించారు. మైనింగ్ పరికరాల తయారీదారులతో, యూఎస్ ప్రభుత్వంలోని వివిధ అత్యున్నత స్థాయి అధికారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మైనింగ్ ఎక్స్ పో విశేషాలను ఎక్స్ వేదికగా వెల్లడించారు. పరికరాల తయారీదారుల ప్రపంచంలోనే అతిపెద్ద సమావేశమైన లాస్ వెగాస్‌లోని మైనింగ్ ఎక్స్‌పోలో తెలంగాణ ప్రభుత్వం తరుపున భాగస్వామ్యమవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఆ మైనింగ్ ఈవెంట్ లో తాజా మైనింగ్ ఆవిష్కరణలు, సాంకేతికతలు, యంత్రాల ప్రదర్శన, పరిశ్రమ నిపుణులతో నెట్‌వర్క్‌కు అవకాశాలపై అవగాహనకు వేదికైందన్నారు. 125 కంటే ఎక్కువ దేశాల నుంచి 44,000 మంది నిపుణులు హాజరైనట్లుగా తెలిపారు. మైనింగ్ రంగం అభివృద్ధిని ప్రోత్సహించే దిశగా ఆమెరికా, భారత్ భాగస్వామ్యం భవిష్యత్తును మరింత ఆశాజనకం చేస్తుందన్నారు.

అమెరికా ప్రతినిధులతో చర్చల్లో ప్రతినిధి

మిగితా 3వ పేజీలో

## రాబోయే రెండురోజులు భారీ వానలే

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. వాయువ్య బంగాళాఖాతం, ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా పయనిస్తుందని పేర్కొంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తం ప్రస్తుతం దక్షిణ ఛత్తీస్‌గఢ్, పరిసర ప్రాంతాల్లో సగుట సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లే కొలది దక్షిణం వైపు వంగి ఉందని తెలిపింది. దాంతో బుధవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

పలుచోట్ల ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల గాలులు వీస్తూ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు భారీ వర్షాలు పడేందుకు అవకాశాలున్నాయని

మిగితా 3వ పేజీలో

## మూసీ సుందరీకరణ పేరుతో వేల కోట్ల కుంభకోణం



- పాకిస్తాన్ కంపెనీకి అప్పగించాలని చూస్తున్న సర్కార్
- సినిమా ఫంక్షన్‌నూ సమర్థవంతంగా నిర్వహించలేకపోయిన ప్రభుత్వం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కూకట్‌పల్లి ఫతేనగర్‌లో ఎస్టీపీని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలన

**బలగం టీవీ, హైదరాబాద్**

మూసీ సుందరీకరణ పేరుతో వేల కోట్ల కుంభకోణం జరుగుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసెడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ఆరోపించారు. మూసీ సుందరీకరణను సీఎం రేవంత్ రెడ్డి ఓ పాకిస్థాన్ కంపెనీకి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బుధవారం కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధి ఎల్బీఎస్ నగర్ లో రూ.300 కోట్ల నిధులతో నిర్మించిన మురుగు నీటిశుద్ధి కేంద్రాన్ని మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, మర్రి రాజశేఖర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు లతో కలిసి

మిగితా 3వ పేజీలో

హైడ్రాలో

## 169 మంది సిబ్బంది కేటాయింపు

**బలగం టీవీ, హైదరాబాద్**

హైడ్రాలో కొత్తగా 169 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పోస్టులను వివిధ విభాగాల్లో ఉన్న సిబ్బందిని డిప్యూటేషన్ పై నియమించేందుకు.. తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ఉత్తర్వుల్లో.. నలుగురు అదనపు కమిషనర్లు, ఐదుగురు డీసీపీలు, 16 మంది సీఐలు, 16 మంది ఎస్సైలు, 60 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 12 మంది స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు, 10 మంది అసిస్టెంట్ ఇంజనీర్లను హైడ్రాకు కేటాయించారు.

## జమ్మూ కశ్మీర్‌లో పోలింగ్ ప్రశాంతం

**బలగం టీవీ, హైదరాబాద్**

జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా రెండో దశ పోలింగ్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. రెండో దశలో ఆరు జిల్లాల పరిధిలోని 26 అసెంబ్లీ స్థానాలకు ఓటింగ్ జరిగింది. 25లక్షలమందికిపైగా ఓటర్లు ఓటు వేశారు. రెండో శ్రీనగర్ జిల్లాలోని ఎనిమిది స్థానాలకు ఓటింగ్ జరిగింది. రియాసిలో ఆరు, బుద్గామ్‌లో ఐదు, రియాసి, పూంచ్ జిల్లాల్లో మూడు చొప్పున, గందర్‌బల్‌లో రెండు స్థానాలకు ఓటింగ్ జరిగింది. సాయంత్రం 5 గంటల వరకు జమ్మూ కశ్మీర్‌లో 54 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యధికంగా రియాసి జిల్లాలో 71.81 శాతం ఓటింగ్ నమోదు కాగా, శ్రీనగర్ జిల్లాలో అత్యల్పంగా 27.31 శాతం ఓటింగ్ రికార్డయ్యింది. ఇంతకు ముందు 18న జరిగిన తొలి దశలో 61.38 శాతం ఓటింగ్ శాతం నమోదైన విషయం తెలిసిందే. అత్యధికంగా కిష్త్వార్ జిల్లాలో 80.20 శాతం ఓటింగ్ జరగ్గా.. అత్యల్పంగా పుల్వామా జిల్లాలో 46.99 శాతం ఓటింగ్ నమోదైంది.




దసరా నాటికి

## ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలి



**బలగం టీవీ, హైదరాబాద్**

దసరా పండుగ నాటికి రాష్ట్రంలో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అన్ని స్థాయిల్లో కమిటీల ఏర్పాటుకు ఒకట్రెండు రోజుల్లో విధివిధినాలు రూపొందించాలని సూచించారు. అర్హులు అందరికీ ఇందిరమ్మ ఇళ్లు దక్కాలన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ, ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇతర రాష్ట్రాలకు లక్షల సంఖ్యలో ఇళ్లు మంజూరు అవుతుంటే, తెలంగాణకు ఎందుకు ఆ స్థాయిలో కేటాయింపులు జరగడం లేదని అధికారులను ప్రశ్నించారు. కేంద్రం మంజూరు చేసే గృహాల్లో ఈసారి రాష్ట్రానికి గరిష్ట సంఖ్యలో సాధించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్ల విషయంలో కేంద్రానికి ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని, డేటాను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. రాజీవ్ స్వగృహలో నిర్మించి ఏళ్ల తరబడి వృథాగా ఉన్న బ్లాక్‌లు, ఇళ్లు వేలం వేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా వాటిని ఎందుకు అప్పగించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులకు ఆ ఇళ్లను అప్పగించాలన్నారు. హైదరాబాద్ నగరంలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లకు మౌలిక వసతులు కల్పించి, అర్హులైన లబ్ధిదారులకు అప్పగించాలని చెప్పారు.

## గాంధీభవన్‌లో మంత్రులతో ముఖాముఖి



- మొదటి రోజు హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహా

**బలగం టీవీ, హైదరాబాద్**

టీపీసీసీ ఆధ్వర్యంలో గాంధీభవన్ లో ఏర్పాటు చేసిన మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. మొదటి రోజు మంత్రి దామోదర రాజనర్సింహా ఈ కార్యక్రమానికి విచ్చేశారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. కొంత మంది కీలక లీడర్లతో ముఖాముఖీ నిర్వహించారు. ఇందిరాభవన్ లో ఉదయం నుంచి సాయంత్రం3.30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగింది. మొదటి రోజు 208 అప్లికేషన్లు రాగా, ఇందులో హెల్త్ ఇష్యూస్, 317 బాధితులు, భూ వివాదం, అక్రమ కేసులు, వివిధ విభాగాల బదిలీలు తదితరవి ఉన్నాయి. 30 మంది ఫిర్యాదులు, సమస్యలను మంత్రి దామోదర స్పాట్ సొల్యూషన్ చూపించారు. గాంధీ, ఉస్మానియా హాస్పిటల్స్ కు సంబంధించిన సమస్యలతో పాటు పలు పోలీస్ స్టేషన్లకు చెందిన రిక్వెస్టులను సంబంధిత అధికారులతో మాట్లాడి మంత్రి పరిష్కారం చూపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పార్టీకి, ప్రభుత్వానికి ఈ కార్యక్రమం ద్వారా మంచి జరుగుతుందన్నారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు అనే తేడా లేకుండా అందరి అర్జీలు తీసుకొని సమస్య పరిష్కరిస్తామన్నారు. అయితే ఓవర్ నైట్‌లో సమస్యలు పరిష్కారం అవుతాయని అనుకోవడం సరికాదన్నారు. ఒక్కొక్కటి క్రమంగా పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. గతంలో అసలు సమస్యలు వినేవారే లేరని, కానీ ఇప్పుడు ప్రజల దగ్గరికే ప్రభుత్వం వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తనకు మొదటి డే అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉన్నదని, ఇందుకు పార్టీకి ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. బాధితుల నుంచి తీసుకున్న అప్లికేసన్లు, సంబంధిత శాఖకు రిఫర్ చేశామని, త్వరలోనే సమస్యలు పరిష్కరించబడతాయని క్లారిటీ ఇచ్చారు.

## బీసీ ఉద్యమ బలోపేతానికే రాజీనామా

వివరాలు 3వ పేజీలో

- జాట్ల తరహాలో తెలంగాణలో బీసీల ఉద్యమం
- బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య వెల్లడించారు.
- కాంగ్రెస్‌లోకి ఆహ్వానించిన మల్లు రవి, తీన్మార్ మల్లన్న

## కోటి మంది మహిళలను
# కోటేశ్వరులను చేయడమే లక్ష్యం..

- ఇందిరా మహిళా శక్తితో మహిళల ఆర్థిక ప్రగతి
- ముంపు గ్రామాల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తాం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**బలగం టీవీ , వేములవాడ :**
ఇందిరా మహిళా శక్తి పథకంతో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.బుధవారం వేములవాడ పట్టణం లో బ్యూటి పార్లల్, వేములవాడ రూరల్ మండలం రుద్రవరం గ్రామంలో ఓపెన్ జిమ్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు..అనంతరం ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా అంబేద్కర్ స్వయం స్వసక్తి సంఘం వారి ఆద్వర్యంలో డైరీ పార్లర్, శ్రీ లక్ష్మి స్వయం స్వసక్తి సంఘం వారి ఆద్వర్యంలో లేడీస్ ఎంపోరియంను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్బంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని,



వారికి కావాల్సిన ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు.సిఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళను కోటీశ్వరులు గా చేసే లక్ష్యంతో ముందుకు పోతున్నారు అని,ప్రతి ఏటా 20 వేల కోట్లు వెచ్చించి బ్యాంకు ద్వారా వారి జీవన ఉపాధిని పెంపొందించే కార్యక్రమాన్ని చేపడుతు మహిళా సాధికారికత లక్ష్యంగా ముందుకు పోతున్నారు అని అన్నారు.

గతంలో మహిళలను లక్ష అధికారులు చేయడం లక్ష్యంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి మహిళలకు పావలా వడ్డీ కి రుణాలు,తదుపరి కిరణ్ కుమార్ రెడ్డి వడ్డీలేని రుణాలను మంజూరు చేశారని అన్నారు.మళ్లీ ప్రజా ప్రభుత్వంలో మహిళా అభివృద్ధి లక్ష్యంగా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో ముందుకు పోతుంది అని అన్నారు.జిల్లాలో ఇంచుమించు 9985 మహిళా సంఘాలలోని 109000 మంది సభ్యులు ఉన్న వారిలో ఎవరైతే ఉపాధి పరిశ్రమలు పెట్టుకోవడానికి ముందుకు వస్తున్నారో,రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో 600 కోట్లుతో వారికి బ్యాంకు రుణాలు ఇప్పిస్తున్నామని అన్నారు.7079 మందికి యూనిట్ల కు ప్రస్తుతం 3030 మందికి నిధులు మంజూరు అయ్యాయని అన్నారు.మహిళలకు ఉపాధి కోసం 125 రకాల ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని, మహిళా సంఘాల ద్వారా ఉపాధి అవకాశాలపై విస్తృత ప్రచారం చేయాలని అన్నారు.సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని గంజాయి రహిత రాష్ట్రంగా మార్చడానికి కృషి చేస్తున్నారని, అందులో భాగంగా యువతకు ఉపయోగపడే ఓపెన్ జిమ్ కు భూమి పూజ నిర్వహించామని అన్నారు. ముంపు గ్రామాల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తానని,మహిళా తల్లులు ఇందిరా మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు
## మరొకరికి 10 ఏండ్ల జైలు శిక్ష..

- నేరాలకు పాల్పడిన వారికి జైలు శిక్ష తప్పదు..
- ఎస్పీ అఖిల్ మహాజన్



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**
ఓ హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు, 2500 రూపాయల జరిమానా, మరో వ్యక్తికి 10 సంవత్సరాల జైలు శిక్ష, 2500 రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత బుధవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ఓ ప్రకటనలో తెలిపారు.

ముస్తాబాద్ గ్రామానికి చెందిన పండుగ రాజం, తన అక్క పండుగ మరియమ్మ కి ఆస్తుల పంపకాల గురించి గొడవలు జరుగుతుండేవి, పండుగ మరియమ్మ, మరియమ్మ కొడుకు పండుగ మల్లేశంలు ఇద్దరు కలిసి 2020 సంవత్సరంలో పండుగ రాజం ను గొడ్డలితో నరికి హత్య చేశారు. ఈ సంఘటనపై అప్పటి సిరిసిల్ల రూరల్ సీఐ సర్వర్ కేసు నమోదు చేసి,పండుగ మరియమ్మ, పండుగ మల్లేశం ను రిమాండ్ కు తరలించి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారని అన్నారు.కోర్టు మానిట రింగ్ ఎస్ ఐ రవీంద్రనాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ నవీన్,దేవేందర్, సీఎంఎస్ కానిస్టేబుల్ నరేందర్ లు 15 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సింగరావు వాదించగా,కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయ మూర్తి నేరం రుజువు కావడంతో నిందుతురాలు పండుగ మరియమ్మ కి పది సంవత్సరాల జైలు శిక్ష తో పాటు 2500 రూపాయల జరిమానా, మరొక నింధితుడైన పండుగ మల్లేశం కు జీవిత ఖైదు జైలు శిక్ష తో , 2500 రూపాయల జరిమానా న్యాయమూర్తి విధించినట్లు తెలిపారు.

సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకొలేరని,శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందని, పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ మరియు న్యాయ నిరూపణ జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారన్నారు . నిందితులకి శిక్ష పడటం లో కృషి చేసిన పీపీ నర్సింగారావు, కోర్టు కానిస్టేబుల్ నవీన్, దేవేందర్, సిఎంఎస్ కానిస్టేబుల్ నరేందర్ లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



## పురుడు పోసిన 108 సిబ్బంది...

**బలగం టీవీ , సిరిసిల్ల**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం సిరికొండ గ్రామానికి చెందినపోతురాజు అనిత కి పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్ కి కాల్ చేయగా సమాచారం అందుకున్న 108 సిబ్బంది టెక్నీషియన్ శ్రీకాంత్, పైలెట్ మనోజ్ లు ఘటన స్థలానికి చేరుకొని చికిత్స కోసం జిల్లా హాస్పిటల్ కు తరలించసాగారు. అయితే మార్గం మధ్యలో పురిటినొప్పున ఎక్కువ కావడంతో సిబ్బంది అంబులెన్స్ లోనే పురుడు పోశారు. దాంతో అతని పండంటి ఆడబిడ్డ కు జన్మించింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని హాస్పిటల్ వైద్యులు తెలిపారు.సకాలంలో స్పందించి పురుడు పోసిన అంబులెన్స్ టెక్నీషియన్ శ్రీకాంత్, పైలెట్ మనోజులను కుటుంబ సభ్యులు, హాస్పిటల్ సిబ్బంది అభినందించారు.

## మైనార్టీ విద్యా సంస్థల్లో ఫ్యాకల్టీ పోస్టులకు ఇంటర్వ్యూలు..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ, సిరిసిల్ల**
మైనార్టీ విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ పోస్టులకు ఔట్ సోర్సింగ్, గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిలో భర్తీ చేసేందుకు బుధవారం జిల్లా కలెక్టర్ చాంబర్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా 8 పోస్టులకు 1:6 చొప్పున ఇంటర్వ్యూ నిర్వహించారు.జిల్లాలోని ఆయా మైనార్టీ విద్యా సంస్థల్లో జూనియర్ లెక్చరర్ (జే ఎల్) పోస్టులకు కోసం దరఖాస్తులు ఆహ్వానించారు. ఒక్కో పోస్టుకు మెరిట్ ప్రకారం ఆరుగురు అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలిచారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన ఆర్ ఎల్ సీ రాజేందర్, డిస్ట్రిక్ట్ ఇంచార్జీ మైనార్టీ ఆఫీసర్ రాధాభాయ్, ఓఎస్ డీ సర్వర్ మియా, ప్రిన్సిపాళ్లు లక్ష్మీనారాయణ, ఫాతిమా అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. మొత్తం 48 మందిని ఇంటర్వ్యూలకు ఆహ్వానించారు.

## రాజన్న లడ్డూ నాణ్యతపై దృష్టి పెట్టాలి..

**బలగం టీవీ , వేములవాడ**
రాజన్న లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యి నాణ్యతపై దృష్టి పెట్టాలి పలువురు భక్తులు కోరుతున్నారు. తిరుమల లడ్డులో కల్తి నెయ్యి వ్యవహారం రాష్ట్రమంతటా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో యాదాద్రి ఆలయ అధికారులు సైతం నెయ్యి వ్యవహారంలో అప్రమత్తమయ్యారు. యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో లడ్డు తయారీకి వినియోగించే నెయ్యిని హైదరాబాద్‌లోనిఓ ల్యాబ్ కు పంపారు. ఆలాగే వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో లడ్డుల తయారీలో వినియోగించే నెయ్యిని కూడా ల్యాబ్ కు పంపించి పరిశోధించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.



## ఏఈవోల సమస్యలను పరిష్కరించండి



- ఏఈఓ ల జిల్లా అధ్యక్షుడు డబ్బేడ లక్ష్మణ్

**బలగం టీవీ , సిరిసిల్ల**
డిసిఎస్ సర్వే వల్ల ఏఈఓ లకు కలిగే సమస్యలు ఇతర ఇబ్బందుల గురించి టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్‌కు రాజన్న సిరిసిల్ల జిల్లా ఏఈవోలు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఈఓ ల జిల్లా అధ్యక్షుడు డబ్బేడ లక్ష్మణ్ మాట్లాడుతూ శుక్రవారం ఏ ఈవోల సమస్యల పరిష్కారం కోసం చీఫ్ సెక్రటరీ కలుద్దామని, జిల్లాలోని ఏఈవోలు అందరూ హాజరుకావాలని రాష్ట్ర ఎన్జీవో అధ్యక్షులు జగదీశ్వర్ పిలుపునిచ్చారని అన్నారు.

క్షేత్ర స్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు అధిక పని ఒత్తిడితో సతమతవుతున్నారు అని,సమస్యల పరిష్కరించేదిశగా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు ఏ ఈ వో ల సమస్యలను పరిశీలించి, పరిష్కారం చూపవలసిందిగా, క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సహాయకులను నియమించాలని డిమాండ్ చేశారు.

## అశాస్త్రీయమైన సర్దుబాటు ప్రక్రియను నిలుపుదల చేయాలి..



- రేషనలైజేషన్ జి.ఓ.25 నిబంధనలను మార్చాలి..
- టీచర్ల సర్దుబాటుతో బదిలీ అయిన ఎస్.జి.టి.లను రిలీవ్ చేయాలి..
- 317 బాధితులకు న్యాయం చేయాలి..
- టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాతూరి మహేందర్ రెడ్డి..

**బలగం టీవీ , గంభీరావుపేట**
తరగతి ఒక గది, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండి విద్యార్థులను వారి తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షించవలసి ఉండగా అశాస్త్రీయమైన జి.ఓ. 25 అమలు చేయాలని పాఠశాల విద్యా సంచాలకులు జిల్లా కలెక్టర్లను ఆదేశించడాన్ని ఖండిస్తున్నట్టు టీపీటీఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాతూరి మహేందర్ రెడ్డి అన్నారు.

గంభీరావుపేట మండలం సముద్ర లింగాపూర్ జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీటీఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో 11 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు అదే విధంగా 60 మంది విద్యార్థులకు కూడా ఇద్దరే ఉపాధ్యాయులను కేటాయించాలని పేర్కొనడం అసంబద్ధమైన విషయం అని అన్నారు.ఇటీవల జరిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలలో పాఠశాల విద్యా శాఖ పాటించిన నిబంధనలను కూడా అమలు చేయడకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు

ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులుండే విధంగా, 40 మంది వరకు ఇద్దరు, 60 మంది వరకు ముగ్గురు, ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుని చొప్పున కేటాయించాలని, ప్రతి ప్రాథమిక పాఠశాల కు ప్రధానోపాధ్యాయుడిని నియమించి ఉపాధ్యాయులను భోధనేతర పనుల నుండి మినహాయించాలని అన్నారు.

నేటి సామాజిక పరిస్థితులను పరిగణలోనికి తీసుకొని ఉన్నత పాఠశాలలో ప్రతి 25 మంది విద్యార్థులకు ఒక సెక్షన్‌గా పరిగణించి ప్రభుత్వ ఉత్తర్వులు 25 ను సవరించాలని డిమాండ్ చేశారు.డియస్సీ నియామకాలు జరగాల్సిన సమయంలో సర్దుబాటు ఉత్తర్వులు ఇవ్వటాన్ని బట్టి నియామకాలు ఇప్పట్లో చేసే ఉద్దేశ్యం లేదా అనే అనుమానం కలుగుతున్నది అని అన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ద్వారాన్కెన బదిలీ అయిన ఎస్‌జిటి. ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలని అన్నారు.317 లో నష్టపోయిన అందరికీ వారి సొంత జిల్లాలకు పంపాలని, పెండింగ్ బిల్లులు, డి ఏ లు మంజూరు చేయాలని, పి ఆర్ సి ప్రకటించి అమలుచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈసీ మెంబెర్ ఉమా బాల చందర్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దుమాల రమానాథ్ రెడ్డి, మండల అధ్యక్షులు కోటగిరి బాల్ రాజు, కార్యదర్శి కరికే ప్రకాష్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, నరేందర్, శివ తదితరులు పాల్గొన్నారు


## సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్‌లను సన్మానించిన సిరిసిల్ల ఫ్యాక్స్



**బలగం టీవీ , తంగళ్లపల్లి**
సిరిసిల్ల ఫ్యాక్స్ కార్యాలయంలో సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వేముల స్వరూప తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్ లను సిరిసిల్ల ఫ్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్ గౌడ్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి మరియు పాలకవర్గ సభ్యులు కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు 5 లక్షలు షిప్ లోన్,8 లక్షల రూపాయలు ల్యాండ్ డెవలప్మెంట్ స్కీం,2 లక్షల రూపాయలు డైరీ ఫామ్ కొరకు మొత్తం 15 లక్షల రూపాయల చెక్కుల పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో ఫ్యాక్స్ డైరెక్టర్ బైరి ప్రభాకర్,గడీల సురేష్, వి.శ్రీధర్ రావు, బండి దేవేందర్ యాదవ్,గన్యా నాయక్,సత్తు వెంకట్ రెడ్డి, శనిగరపు లక్ష్మి,కె ,పర్శయ్య, సీఈఓ బుర్ర నరేష్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉస్మాన్ సాగర్ 2 గేట్లు ఎత్తివేత

**బలగం టీవీ, హైదరాబాద్**
హైదరాబాద్ జంట జలాశయాలు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ చెరువులకు వరద పోటెత్తింది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. హిమాయత్ సాగర్ పూర్తి నీటిమట్టం 1,764 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 1,762 అడుగులుగా ఉంది. ఉస్మాన్ సాగర్ పూర్తి నీటిమట్టం 1,790 అడుగులు కాగా, ప్రస్తుతం 1789.9 అడుగులుగా ఉంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం వరకు నీరు చేరింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి 11.30 గంటల తర్వాత 2 గేట్లు ఒక అడుగు మేర ఎత్తి 234 క్యూసెక్కుల నీటిని కిందికి విడుదల చేశారు. అటు హిమాయత్ సాగర్ జలాశయానికి సైతం వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టానికి దగ్గరలో ఉంది. దీంతో బుధవారం సాయంత్రం 7 గంటలకు రిజర్వాయర్ 1 గేటు ఒక అడుగు మేర అధికారులు ఎత్తారు. ఈ నేపథ్యంలో అధికారులు దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.



## కేకే మహేందర్ రెడ్డి పై ఎలాంటి వ్యాఖ్యలు చేసినా ఊరుకునేది లేదు

- కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్




**బలగం టీవీ, సిరిసిల్ల**
రేషన్ దుకాణాల ఖాళీల భర్తీ పారదర్శకంగా చేయడం జరిగిందని,కొంతమంది బీఆర్ఎస్ నాయకులు కేకే మహేందర్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న దోపిడి, బ్లాక్ మెయిల్ రాజకీయాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉండవని అన్నారు. కాంగ్రెస్ నేత కేకే మహేందర్ రెడ్డి పై మాట్లాడిన,బీఆర్ఎస్ నాయకుడు తన గతం ఆలోచించి మాట్లాడాల్సి ఉండేదని,ఇసుక మాఫియా కేకే మహేందర్ రెడ్డి గురించి మాట్లాడతారా అని అన్నారు.

సిరిసిల్ల నియోజకవర్గంలో గతంలో బీ ఆర్ ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారంగా అమ్ముకున్న రేషన్ షాపులు అక్రమ పీడీఎస్ రైస్ దందాలను గుర్తించి,కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో నిజమైన అర్హులకు రేషన్ షాపు నిర్వహణకు అవకాశం ఇవ్వాలని,అర్హులను గుర్తించడానికి రాత పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన వారిని ఇంటర్వ్యూ ద్వారా పారదర్శకంగా ఎంపిక చేసి గుర్తించారని అన్నారు.

ఇది మొత్తం ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమని,కొంతమంది కావాలని రాజకీయంగా ఎదుర్కోలేని వ్యక్తులు కేకే మహేందరన్న గురించి తప్పుగా ప్రచారం చేస్తూ కావాలని అల్లర్లు సృష్టిస్తున్నారు అని అన్నారు.ప్రజలు అన్నిటినీ గ్రహిస్తారు అని,పదేండ్ల పాలనలో సిరిసిల్ల ఆగమైన తీరు స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు.ఇప్పటికైనా సిరిసిల్ల ప్రాంత అభివృద్ధిలో భాగమయ్యే ఆలోచన చేయాలి తప్పా,బురదజల్లే ప్రయత్నాలు చేయవద్దని అన్నారు.మీ పదేండ్ల పాలనలో ప్రశ్నించే ప్రతి గొంతును నొక్కినట్టే,ఇంకా అవే ఆలోచనలతో

ప్రజా నాయకుడు ముక్కుసూటి మనిషి మా మహేందర్ రెడ్డి గురించి తప్పుగా వాగడం సరికాదని,మీకు ప్రజలు తప్పక బుద్ధి చెబుతారు అని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వైద్య శివప్రసాద్ నీలి రవీందర్ కత్తెర దేవదాస్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దుబాల వెంకటేశం ఆడెపు జగన్, ఖాజా, చేపూరి శ్రీనివాస్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ చొప్పదండి ప్రమోద్, మాజీ డైరెక్టర్ రాజు,ఇరుకుల్ల భాస్కర్,గొల్లపల్లి పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే మరో 35000 పోస్టులు భర్తీ



(మొదటి పేజీ తరువాయి)

ఉపాధి లేకుంటే యువత చెడు వ్యసనాల వైపు వెళ్లే ప్రమాదం ఉందని.. బీటెక్ చదివిన విద్యార్థులు కూడా డ్రగ్స్ వలయంలో చిక్కుకుంటున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. డ్రగ్స్ సమస్య నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామని.. ప్రభుత్వం మాత్రమే ఈ సమస్యను పరిష్కరించలేదని.. అందరూ కలిసి కట్టుగా వస్తేనే డ్రగ్స్ నిర్మూలన సాధ్యమని గుర్తు చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువత మారి.. మన విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

ఇంజినీరింగ్ విద్యార్థులు కేవలం థియరీ మాత్రమే నేర్చుకుని జాబ్ స్కిల్స్ నేర్చుకోవడం లేదని.. కొన్ని కాలేజీల్లో ఫ్యాకల్టీ, వసతులు ఉండటం లేదని పేర్కొన్నారు. కాలేజీల్లో సరైన సౌకర్యాలు, వసతులు లేకపోతే గుర్తింపును రద్దు చేసేందుకు కూడా వెనుకాడబోమని చెప్పారు. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఇప్పటివరకు 30 లక్షల మంది నమోదు చేసుకున్నారని.. తెలంగాణ ఏర్పడిన 10 ఏళ్ల తర్వాత కూడా 60 లక్షల మంది నిరుద్యోగులుగా ఉన్నారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన 90 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు చెప్పారు. డీఎస్సీ, గ్రూప్స్ విభాగాల్లో మరో 35వేల ఉద్యోగాల భర్తీ చేపట్టామని.. త్వరలోనే మరో 35 వేల పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించారు. ఎంత చదువుకున్నా నాలెడ్జ్, కమ్యూనికేషన్ ఉంటేనే యువతకు మంచి ఉద్యోగాలు వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



## తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అమెరికా కంపెనీలు ఆసక్తి

(మొదటి పేజీ తరువాయి)

బృందం నాయకుడు అరుణ్ వెంకటరామన్, గ్లోబల్ మార్కెట్స్ అసిస్టెంట్ సెక్రటరీ, ఒలిమర్ రివెరా నోవా, సీనియర్ పాలసీ అడ్వైజర్, శ్రీ శంతను సర్కార్, కమర్షియల్ స్పెషలిస్ట్, కార్నెలియస్ గ్యామ్ఫీ, ఇంటర్నేషనల్ ట్రేడ్ స్పెషలిస్ట్, డెరెక్ షికీసెన్, గ్లోబల్ ఎనర్జీ సెక్టార్ లీడ్, జాస్మిన్ బ్రాస్వెల్, గ్లోబల్ డిజైన్ కన్‌స్ట్రక్షన్ ట్రేడ్ స్పెషలిస్ట్ లు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో కొత్తగా నిర్మించనున్న నాల్గవ నగరం ప్రణాళికలను, తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వృద్ధి ఇంజన్‌గా హైదరాబాద్ యొక్క ప్రాముఖ్యతను, హైదరాబాద్‌లోని అమెరికన్ కంపెనీల పురోగతిని ఈ సమావేశంలో భట్టి వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రతినిధుల బృందం సానుకూలత తెలుపడంతో చర్చలు ఫలప్రదమైనట్లుగా భట్టి తెలిపారు.

# మూసీ సుందరీకరణ పేరుతో వేల కోట్ల కుంభకోణం



(మొదటి పేజీ తరువాయి)

ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్టీపీ పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ దక్షిణ ఆసియాలో 100% మురుగునీరు శుద్ధి చేసిన కేంద్రంగా హైదరాబాద్ నగరం నిలవాలనే సదుద్దేశంతో తీర్చిదిద్దినట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో మురుగునీరు శుద్ధి చేయడం కోసం రూ.4,000 కోట్ల నిధులతో ఎస్టీబీలు నిర్మించినట్లు తెలిపారు. మూసి సుందరీకరణ పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుంభకోణాలకు తావిస్తున్నారని ఆరోపించారు. మూసి సుందరీకరణ చేస్తారా అసలు ఉద్దేశం ఇంకేమైనా ఉందా...? అని అనుమానం వ్యక్తం చేశారు. మూసే ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు పొంతనలేని వ్యాఖ్యలు చేస్తూ అనుమానాలకు తావిస్తున్నారని ఆరోపించారు.

అనంతరం కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్ మహా నగరాన్ని ఒక విశ్వనగరంగా తీర్చిదిద్దాలనే దృఢ కసంకల్పంతో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నేతృత్వంలో జీహెచ్ఎంసీ పరిధిలో ప్రతి రోజు ఉత్పత్తి అయ్యే 20 కోట్ల లీటర్ల మురికి నీటిని సంపూర్ణంగా శుద్ధి చేయాలనే ఉద్దేశంతో రూ. 4 వేల కోట్లతో 31 ఎస్టీపీలకు శ్రీకారం చుట్టామని తెలిపారు.

ఇండియాలోనే 100 శాతం సీవరేజ్ ట్రీట్‌మెంట్ చేసే ఏకైక నగరంగా హైదరాబాద్‌ను మార్చాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం తీసుకున్నామని కేటీఆర్ గుర్తు చేశారు. ఇవాళ కూకట్‌పల్లి ఫతేనగర్‌లో ఏర్పాటు చేసిన 133 ఎంఎల్‌డీల ఎస్టీపీ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇది ప్రస్తుతం ట్రయల్ రన్ దశలో ఉంది. ఎస్టీపీల సందర్శనలో ఇది మొదటి అడుగు మాత్రమే.. ఉప్పల్ నల్ల చెరువు, ఎల్‌బీనగర్, కుత్బుల్లాపూర్, రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేస్తున్న ఎస్టీపీలను కూడా త్వరలోనే సందర్శిస్తాం అని పేర్కొన్నారు.

ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీరు మూసీలోకి వెళుంది. 94 శాతం స్వచ్ఛమైన నీరు వెళ్తున్నప్పుడు మూసీ శుద్ధి ఎందుకు..? కొత్తగా మీరు శుద్ధి చేసేదేమీ లేదు. మూసీ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి, మంత్రుల మాటలకు పొంతన లేదు. సీఎం రూ. లక్షా 50 వేల కోట్లు అని అంటడు. మంత్రులేమో రూ. 50 వేల కోట్లు, ఇంకొందరేమో రూ. 70 వేల కోట్లు అని మాట్లాడుతున్నారు. ఈ మాటలను చూస్తుంటే అనుమానం వస్తుంది. మూసీ శుద్ధి వెనుక ప్రభుత్వ అస్సలు ఉద్దేశం వేరే ఉంది అనే అనుమానం ప్రజల్లో కలుగుతుందని కేటీఆర్ తెలిపారు.

హైదరాబాద్‌లో ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు కట్టలేదు అని గతంలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క మాట్లాడారు. నాడు తలసాని శ్రీనివాస్ యాదవ్ దగ్గరుండి భట్టికి డబుల్ బెడ్రూం ఇండ్లు చూపించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో 12 వేల ఆక్రమణలు ఉన్నాయని సీఎం చెప్పారు. వాటిని తొలగించి బాధితులకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని చెప్పారు. మేం డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టకపోతే మీరు ఎక్కడ్నుంచి ఇస్తున్నారు..? ఇప్పటిదాకా మీరు చెప్పినవి అబద్దాలు అని తేలిపోయింది. కేసీఆర్ చేసిన మంచి పనని ఒప్పుకోక తప్పట్లేదన్నారు.

సబిత ఇంద్రారెడ్డి నేతృత్వంలో 14 వేల ఎకరాలు ఫార్మా సిటీ కోసం సేకరిస్తే దాన్ని రద్దు చేసి ఫ్యూచర్ సిటీ అని, ఇంకోటి అని రకరకాల డ్రామాలు ఆడుతున్నారు. మూసీకి సంబంధించి మూసీ సుందరీకరణ పేరిట కొత్త నాటకాలు ఆడుతున్నారు. మీరు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయండి. రైతుభరోసా అందించండి.. పబ్లిసిటీ స్టంట్లతో ఎక్కువ రోజులు మాయ చేయలేరు. హైదరాబాద్ ప్రజలకు మేం చేసిన పని బాగా తెలుసు. లింకు రోడ్లు, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, స్మశాన వాటికలు, లైబ్రరీలు కట్టాం. ఇవన్నీ ప్రజల దృష్టిలో ఉన్నాయని కేటీఆర్ తెలిపారు.మూసీ సుందీకరణ పేరుతో కుంభకోణం జరుగుతంది. దాన్ని కూడా బయటకు తీస్తాం. పాకిస్తాన్‌కు చెందిన కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇవన్నీ ప్రజలను గమనిస్తున్నారు. భవిష్యత్‌లో అన్ని విషయాలను ప్రజల దృష్టికి తీసుకువస్తాం. పేదలకు ఒక న్యాయం.. పేదోళ్లకు ఒక న్యాయం ఉంది. పేదోళ్లను బుల్డోజర్ల కింద నలిపేస్తున్నారు. బాధితులకు డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయించండి.. ఆలస్యం చేయకండి. పుస్తకాల కోసం వేద శ్రీ మాట్లాడిన మాటలు వింటే గుండె బరువెక్కిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు.



## బీసీ ఉద్యమ బలోపేతానికే రాజీనామా

- జాట్ల తరహాలో తెలంగాణలో బీసీల ఉద్యమం
- బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య వెల్లడించారు.
- కాంగ్రెస్‌లోకి ఆహ్వానించిన మల్లు రవి, తీన్మార్ మల్లన్న

బలగం టీవి, హైదరాబాద్

రాష్ట్ర రాజకీయాలకు అతీతంగా బీసీల ఉద్యమం బలోపేతానికే రాజ్యసభ సభ్యత్వానికి తాను రాజీనామా చేశానని బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య వెల్లడించారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల తరపున చట్టసభల్లో ప్రశ్నించినా సమాధానం రావడం లేదని, దీంతో ప్రజా ఉద్యమమే శరణ్యమని భావించి ఇంకా నాలుగేండ్ల గడువున్నా రాజీనామా చేశానని తెలిపారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల సాధనే తన జీవిత ధ్యేయమని, ఆ దిశగా పోరాటాలను ఉధృతం చేస్తానని చెప్పారు. రాజకీయ పార్టీ పెట్టాలని బీసీ బిడ్డల నుంచి వస్తున్న ఒత్తిడిపై కూలంకషంగా చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. ఈ పోరాటాల్లోకి రాజకీయాలకతీతంగా బీసీలంతా కదలిరావాలని కోరారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన ఆర్ కృష్ణయ్యతో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి బుధవారం ఉదయం భేటీ అయ్యారు. కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఆహ్వానించారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సైతం ఆర్ కృష్ణయ్యను కలిసి ఇదే విషయమై చర్చలు జరిపారు. సమావేశంలో బీసీ సంఘాల నేతల గుజ్జ కృష్ణ, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే రెండురోజులు భారీ వానలే

(మొదటి పేజీ తరువాయి)

చెప్పింది. వరంగల్, హన్మకొండ, ఖమ్మం, మహబూబాబాద్, జనగాంతో పాటు పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## 28న తిరుమలకు ఏపీ మాజీ సీఎం జగన్

బలగం టీవి, హైదరాబాద్

ఏపీ మాజీ సీఎం జగన్ ఈ నెల 28న కాలినడకన తిరుమలకు వెళ్లనున్నారు. తిరుమల లడ్డూ పవిత్రతను, స్వామివారి ప్రసాదం విశిష్టతను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన ఏపీ సీఎం చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు 28న అన్ని దేవాలయాల్లో పూజలు నిర్వహించాలని వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వేంకటేశ్వరస్వామి వైభవాన్ని, టీటీడీ పేరు ప్రఖ్యాతులను, లడ్డూ పవిత్రతపై రాజకీయ దుర్బుద్ధితో కావాలని అబద్ధాలాడుతున్నారని దుయ్యబట్టారు.

## అక్రమ కేసులు బనాయిస్తున్నవారిని వదిలిపెట్టబోం

బలగం టీవి, హైదరాబాద్

వికారాబాద్ నియోజకవర్గం మరుపల్లిలో బీఆర్ఎస్ కార్యకర్తలైన నవీన్, ప్రవీణ్ అనే ఇద్దరు దళితులపై స్థానిక ఎస్సై, పోలీసులు దాడి చేసిన ఘటనపై ఆ పార్టీ వరింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలపై దాడులు చేస్తున్నవారిని, అక్రమ కేసులు బనాయిస్తున్నవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. మరుపల్లిలో దాడికి గురైన దళితులతో కలిసి బుధవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు.

%ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పిన కేటీఆర్.. పార్టీ అం డగా ఉంటుందని, లీగల్‌సెల్ ద్వారా న్యా యసాయం అందిస్తామని భరోసా ఇచ్చా రు. అవసరమైతే తాను కూడా వికారాబాద్‌కు వచ్చి ఆందోళన చేస్తానని ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు, హ్యూ మన్ రైట్స్ కమిషన్‌కూ ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఎస్సైలు, సీఐలు ఎక్స్‌ట్రాలు వేస్తే వారిని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. మన మీద దాడులు చేస్తూ, తప్పుడు కేసులు బనాయిస్తున్నవారి పేర్లు రాసి పెట్టుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక వారికి శంకరగిరి మాన్యాలు పటిస్తామని చెప్పారు.

తన సొంత నియోజకవర్గంలోనే దళితబిడ్డలను పోలీసులు కొడుతుంటే స్పీకర్ పట్టించుకోకపోవటం విచారకరమని కేటీఆర్ పేర్కొన్నారు. దాడికి పాల్పడిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని స్పీకర్, డీజీపీతో మాట్లాడుతానని చెప్పారు. సమావేశంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద పటేల్, తదితరులు పాల్గొన్నారు.

# రంజీ ప్రాబబుల్స్‌లో కోహ్లీ, పంత్




**బలగం టీవీ, న్యూఢిల్లీ**

స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రిషబ్ పంత్ దేశవాళీ క్రికెట్‌లో ఆడనున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని తెలుపుతూ ఢిల్లీ క్రికెట్ సంఘం తన ప్రాబబుల్స్‌ను ప్రకటించింది.

మొత్తం 84 మందితో కూడిన ప్రాబబుల్స్ స్క్వాడ్‌ను ఢిల్లీ క్రికెట్ సంఘం తాజాగా అనౌన్స్ చేసింది. ఈ రంజీ ట్రోఫీ కోసం సెలెక్ట్ చేసిన ఆటగాళ్లకు సెప్టెంబర్ 26న ఫిట్‌నెస్ టెస్ట్ జరుగుతుంది. అయితే, ప్రస్తుతం ఇంటర్నేషనల్ క్రికెట్‌లో ఆడే ప్లేయర్స్‌కు మాత్రం ఫిట్‌నెస్ టెస్టు ఉండదు. ఈ విషయాన్ని డీడీసీఏ వెల్లడించింది. అక్టోబర్ 11 నుంచి రంజీ ట్రోఫీ ఎలైట్ పోటీలు మొదలు కానున్నాయి. నవదీప్ సైని కూడా ఇందులో చోటు దక్కింది. కానీ గత సీజన్‌లో ఆడిన సీనియర్ పేసర్ ఇషాంత్ శర్మకు మాత్రం ఈసారి ఛాన్స్ రాలేదు.

కాగా, రంజీ ట్రోఫీలో గతంలో ఢిల్లీ జట్టు తరఫున గౌతమ్ గంభీర్, శిఖర్ ధావన్ తదితరులు ప్రాతినిధ్యం వహించారు. విరాట్ చివరిసారిగా 2012–13 సీజన్‌లో రంజీ ట్రోఫీ బరిలోకి దిగాడు. ఉత్తర్‌ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆడాడు. పంత్ కూడా 2016–17 సీజన్‌లో బరిలోకి దిగాడు. ఝార్ఖండ్‌పై కేవలం 48 బంతుల్లోనే శతకం బాది అత్యంత వేగంగా సెంచరీ చేసిన బ్యాటర్‌గా రికార్డుకెక్కాడు.

ఢిల్లీ ప్రాబబుల్స్‌లో విరాట్, పంత్ పేర్లు ప్రకటించినప్పటికీ వీరిద్దరు ఆడటం కష్టమే. ఎందుకంటే అక్టోబర్ 16 నుంచి న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్ జరగనుంది. ఇక ఈ సిరీస్ తర్వాత ఐదు టెస్టుల బోర్డర్ – గావస్కర్ ట్రోఫీ కోసం టీమ్ఇండియా ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది.

# ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల.. ఎగబాకిన జైస్వాల్



- **5 స్థానాలు మెరుగుపరుచుకున్న శుభ్‌మన్ గిల్**

**బలగం టీవీ, హైదరాబాద్**


ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదలయ్యాయి. టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఒక స్థానాన్ని మెరుగు పరుచుకొని ఐదో స్థానంలో నిలిచాడు. దాంతో భారత్ తరఫున టాప్ ర్యాంక్ కలిగిన బ్యాటర్‌గా నిలిచాడు. బంగ్లాదేశ్‌తో చెన్నై వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో యశస్వి జైస్వాల్ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు.అలాగే శుభ్‌మన్ గిల్ 5 స్థానాలు మెరుగు పరుచుకొని 14వ స్థానంలో నిలిచాడు.

మరోవైపు బంగ్లాదేశ్‌తో తొలి టెస్ట్‌లో దారుణంగా విఫలమైన టీమిండియా స్టార్ బ్యాటర్లు కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఐదేసి స్థానాలు దిగజారారు. రోహిత్ 10వ స్థానంలో నిలవగా.. కోహ్లీ 12వ స్థానంలో నిలిచాడు. ఇక ఈ మ్యాచ్‌లో శతకంతో రాణించిన రిషభ్ పంత్ తన ఆరో ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు.

న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. డారిల్ మిచెల్ రెండో స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ ఐదో స్థానంలో నిలవగా.. ఉస్మాన్ ఖవాజా ఏడో స్థానంలో నిలిచాడు.పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ మహమ్మద్ రిజ్వాన్, ఆసీస్ స్టార్ మార్నస్ లబుషేన్ 8,9వ స్థానాల్లో కొనసాగుతున్నారు. పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజామ్ 11వ స్థానంలో నిలిచాడు.

బౌలింగ్ విభాగంలో అశ్విన్, జస్‌ప్రీత్ బుమ్రా తమ టాప్ ర్యాంకు లను నిలబెట్టు కోగా.. జడేజా ఒక స్థానాన్ని మెరుగుపరుచుకొని 6వ స్థానానికి చేరాడు.తొలి టెస్ట్ ఆడని కుల్దీప్ యాదవ్ ఒక స్థానం కోల్పోయి 16వ స్థానంలో నిలిచాడు.

ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ తమ టాప్2 ర్యాంకులను నిలబెట్టుకున్నారు. అక్షర్ పటేల్ 6వ స్థానంలో కొనసాగుతుండగా.. బంగ్లాదేశ్ ప్లేయర్ షకీబ్ అల్ హసన్ తన రెండో ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు.



# రెండో టెస్టుకు వర్ష సూచన

**బలగం టీవీ, కాన్పూర్**

తొలి టెస్టులో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసిన భారత్ రెండో టెస్టు కూడా నెగ్గి సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలని భావిస్తోంది. కాన్పూర్ వేదికగా శుక్రవారం నుంచి ఆఖరి టెస్టు ప్రారంభం కానుంది. అయితే ఈ టెస్టుకు వర్షం ఆటంకం కలిగించేలా ఉంది. టెస్టు మొదటి రెండు రోజులు భారీ వర్షపు సూచన ఉంది. వాతావరణ శాఖ ప్రకారం... శుక్రవారం 92 శాతం వర్షం కురిసే అవకాశం ఉంది. అలాగే శనివారం 80 శాతం వర్షం పడే ఛాన్స్ ఉంది.ఈ నేపథ్యంలో ఇప్పటికే ఉత్తరప్రదేశ్ క్రికెట్ అసోషియేషన్.. ఢిల్లీ క్రికెట్ అసోషియేషన్‌ను అదనపు కవర్లను కోరింది. మైదానాన్ని పూర్తిగా కప్పి ఉంచడానికి సిద్ధమైంది. అయితే మైదానానికి మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ ఉందని, పూర్తి మ్యాచ్ కొనసాగేలా ప్రయత్నిస్తామని స్థానిక క్రీడా అధికారి తెలిపారు.



# కాన్పూర్ చేరుకున్న టీమిండియా

**బలగం టీవీ, కాన్పూర్**

బంగ్లాదేశ్‌తో చివరిదైన రెండో టెస్టు కోసం భారత క్రికెట్ జట్టు కాన్పూర్ చేరుకుంది. ఎయిర్‌పోర్ట్‌కు చేరిన ఆటగాళ్లను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో పటిష్ట భద్రత మధ్య వారిని.. పోలీసులు టీమిండియా బస చేసే హోటల్‌కు తీసుకెళ్లారు. బంగ్లాదేశ్ జట్టు కూడా కాన్పూర్ చేరుకుంది.ఈనెల 27 నుంచి రెండో టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది. దీంతో రెండు జట్లు కూడా గ్రీన్ పార్క్ స్టేడియంలో సాధన చేయనున్నాయి.

# ఆసీస్‌పై ఇంగ్లాండ్ విజయం

- **డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 46 రన్స్ తేడాతో విజయం**
- **హ్యారీ బ్రూక్స్ సెంచరీ**




**బలగం టీవీ, చెస్టర్ లీ స్ట్రీట్**

ఆస్ట్రేలియాతో జరిగిన మూడవ వన్డేలో ఇంగ్లండ్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 46 పరుగుల తేడాతో విజయం సాధించింది. 5 మ్యాచ్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా ఆధిక్యాన్ని 2–1కి తగ్గించింది ఇంగ్లండ్. హ్యారీ బ్రూక్ సెంచరీ చేశాడు.

మూడో వన్డేలో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 304 రన్స్ చేసింది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో స్టీవ్ స్మిత్ 60, గ్రీన్ 42, అలెక్స్ క్యారీ 77, మ్యాక్స్‌వెల్ 30, హార్డీ 44 రన్స్ చేశారు. ఆ తర్వాత భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇంగ్లండ్ ఓ దశలో 11 పరుగులకే రెండు వికెట్లను కోల్పోయింది.అయితే ఆ సమయంలో క్రీజ్‌లోకి దిగిన ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ 94 బంతుల్లోనే సెంచరీ కొట్టాడు. అతని ఇన్నింగ్స్‌లో 13 ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి. 37.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 254 పరుగులు ఇంగ్లండ్ చేయగా ఆ సమయంలో వర్షం కారణంగా ఆట నిలిచిపోయింది. కానీ అప్పటికే డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఇంగ్లండ్ విక్టరీ ఖాయమైంది. బ్రూక్స్ 110 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇంగ్లండ్ బ్యాటర్లలో విల్ జాక్స్ 84, లివింగ్‌స్టోన్ 33 రన్స్ చేశారు.

# ఈ సారి కప్ కొడతాం




- **భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఈ సారి టీ20 వరల్డ్ కప్ గెలిచి తీరుతామని భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తెలిపింది. అక్టోబర్ 3 నుంచి యూఏఈ వేదికగా మహిళల టీ20 ప్రపంచకప్ జరనున్న విషయం తెలిసిందే. ఈ వరల్డ్‌కప్‌లో పాల్గొనేందుకు భారత అమ్మాయిలు బయలుదేరారు. ఈ నేపథ్యంలో మీడియా సమావేశంలో పాల్గొన్న హర్మన్‌ప్రీత్ కీలక వ్యాఖ్యలు చేశారు. అత్యుత్తమ జట్టుతో టీ20 కప్ వేటకు వెళ్తున్నామని పేర్కొంది. గత పొరపాట్లను సరిదిద్దుకొని విజేతగా తిరిగొస్తామని హర్మన్‌ప్రీత్ తెలిపింది. మెగాటోర్నీ కోసం కఠోర సాధన చేశామని, ఫీల్డింగ్, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పింది. గతంలో సెమీస్‌లో ఓడిపోయామని, గత టోర్నీల కంటే ఈసారి మరింత మెరుగ్గా సన్నద్ధమయ్యామని వెల్లడించింది. ఏ జట్టును అయినా ఓడించగలమని, ఈ విషయం ఆస్ట్రేలియాకు కూడా తెలుసని హర్మన్‌ప్రీత్ తెలిపింది.

కాగా, అక్టోబర్ 3 నుంచి 20 వరకు మహిళల టీ20 వరల్డ్ కప్ జరగనుంది. అయితే అంతకుముందు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ మెగాటోర్నీ బంగ్లాదేశ్ వేదికగా జరగాల్సి ఉంది.కానీ అక్కడ నెలకొన్న రాజకీయ సంక్షోభం నేపథ్యంలో పొట్టి కప్‌ను యూఏఈ వేదికగా నిర్వహిస్తున్నారు. ఈ ప్రపంచకప్‌లో మొత్తం పది జట్లు పాల్గొంటున్నాయి. అయిదు జట్లు రెండు గ్రూప్‌లు విడిపోయి సెమీఫైనల్స్ బెర్తు కోసం పడనున్నాయి.

గ్రూప్–ఏలో భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్థాన్, శ్రీలంక ఉన్నాయి. మరోవైపు గ్రూప్–బీలో సౌతాఫ్రికా, ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, స్కాట్లాండ్ ఉన్నాయి. అక్టోబర్ 4 నుంచి భారత్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. న్యూజిలాండ్‌తో తొలి మ్యాచ్ ఉంది. అక్టోబర్ 6న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో టీమిండియా అమీతుమి తేల్చుకోనుంది. అలాగే అక్టోబర్ 9న శ్రీలంక, అక్టోబర్ 13న ఆస్ట్రేలియాతో తలపడనుంది. అక్టోబర్ 17, 18న సెమీఫైనల్స్, అక్టోబర్ 20న ఫైనల్ జరగనుంది.